సాక్షి విశాఖపట్నం

శనివారం। 15। జూలై। 2023



## కొండవాలు ప్రాంతాల అభివృద్ధి

కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మేయర్ హరివెంకట కుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు తెలిపారు. 8లో



## అదుర్స్.. మిల్లెట్ టిఫిన్స్

ఒకప్పుడు పేదల ఆకలి తీర్చిన చిరుధాన్యాలు ఇప్పుడు అందరి మెనూలో చేరాయి. మిల్లెట్స్ టిఫిన్స్‌కు ఆదరణ పెరుగుతోంది. 8లో



## 100 గజాల వరకు ఉచితం..

జీవో నంబర్ 301, 388 ద్వారా క్రమబద్ధీకరణ పట్టాలు పొందిన లబ్ధిదారులకు కన్వెయన్స్ డీడ్‌లను జేసీ అందజేశారు. 8లో

## న్యూస్‌రీల్

### నేటి నుంచి కందిపప్పు విక్రయం



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న జేసీ

సాక్షి, విశాఖపట్నం : ధరలభారం వినియోగదారులపై పడకుండా తక్కువ ధరకే నిత్యావసరాలు అందించనున్నట్టు జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ చెప్పారు. ఇందులో భాగంగా శనివారం నుంచి కిలో బియ్యం రూ.46కు, కందిపప్పు కిలో రూ.137కు ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించనున్నామన్నారు. ఈమేరకు హోల్‌సేల్ డీలర్లతో జేసీ సమావేశమయ్యారు. రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల వద్ద వినియోగదారుడు రేషన్ కార్డు, ఆధార్ కార్డు చూపించాలని సూచించారు. కుటుంబానికి 5 నుంచి 26 కేజీల వరకు బియ్యంతో పాటు కిలో కందిపప్పు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ యాసిన్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేశ్వరి, జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ సీపీ

దొండపర్తి (విశాఖ దక్షిణ): ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను 0891–2523408 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి నేరుగా కమిషనర్‌కు విన్నవించే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఇందులో వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని సీపీ త్రివిక్రమ్ వర్మ తెలిపారు.

### ఫైన్ చెల్లించకపోతే వాహనం సీజ్

గోపాలపట్నం: రహదారి నియమాలు ఉల్లంఘించిన వాహనదారులపై గతంలో కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించామని, వారంతా వెంటనే నగదు చెల్లించాలని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జరిమానాలు చెల్లించని ఆయా వాహనదారుల సెల్‌ఫోన్లకు ఇప్పటికే మెసేజ్‌లు పంపించామన్నారు. ఎస్ఎంఎస్ లింక్ ద్వారా ఫైన్ చెల్లించవచ్చని తెలిపారు. జరీమానాలు చెల్లించని వాహనాలను ఈ నెల 20వ తేదీ నుంచి సీజ్ చేస్తామని హెచ్చరించారు.

### స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఖైదీలకు అవగాహన



ఖైదీకి కిట్ అందజేస్తున్న అధికారులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో హెచ్‌పీసీఎల్ అధికారులు శుక్రవారం ఖైదీలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఖైదీలతో ప్రతిజ్ఞ చేయించారు. శుభ్రతతోనే ఆరోగ్యమని సూచించారు. అనంతరం సుమారు 300 మందికి సబ్బులు అందజేశారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, హెచ్‌పీసీఎల్ ఈడీ వి.రతన్‌రాజ్, సీజీఎం జి.కిరణ్‌కుమార్, డీజీఎం వి.ప్రభాకర్ పాల్గొన్నారు.

# గెడ్డలే అడ్డా..

## ఇదీ వైజాగ్ ప్రొఫైల్స్ ఆక్రమణల కథ

- ఏకంగా 95 సెంట్ల మేర ఆక్రమణ
- దర్జాగా విల్లాలు, అపార్టుమెంట్ల నిర్మాణం
- గ్రీన్ సిటీ పేరుతో అక్రమాలు
- రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా



ఈ ఫొటోలో ఉన్నవి వైజాగ్ ప్రొఫైల్స్ సంస్థ గ్రీన్‌సిటీ పేరుతో ఏర్పాటు చేస్తున్న ఫ్లాట్లు, విల్లాల నిర్మాణం. ఇక్కడ ఉన్న గెడ్డలను దర్జాగా ఆక్రమించి వైజాగ్ ప్రొఫైల్స్ సంస్థ అడ్డాగా మార్చుకుంది. గాజువాక మండలంలోని తుంగ్లాం గ్రామ పరిధిలో వైజాగ్ ప్రొఫైల్స్ సంస్థ చేస్తున్న నిర్వాకం ఇది.



ఈ ఫొటోలో ఉన్నది సర్వే నంబరు 6, 8 సరిహద్దులను చూపుతున్న పటం. ఈ పటంలో స్పష్టంగా సర్వే నంబరు 6, 8 లోని గెడ్డలను ఆక్రమించి నిర్మాణం జరిపినట్టు అర్థమవుతోంది. తమ స్థలంలోని సర్వే నంబరు 7,9లల్లో ఉన్న స్థలానికి పరిమితం కాకుండా మొత్తం 95 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ విధంగా ఆక్రమించిన ఈ స్థలం విలువ రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల మేర విలువ చేస్తుందని తెలుస్తోంది.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

గాజువాడ మండలం తుంగ్లాం రెవెన్యూ గ్రామ పరిధిలో భూముల ధరలకు మంచి డిమాండ్ ఉంది. మంచి డిమాండ్ ఉన్న ఈ స్థలంపై సదరు వైజాగ్ ప్రొఫైల్స్ కంపెనీ కన్ను పడింది. తమ స్థలానికి ఆనుకుని ఉన్న గెడ్డలను ఆక్రమించి నిర్మాణాలు సాగించింది. ఇందులోనే నిబంధనలకు అనుగుణంగా చూపించాల్సిన ఖాళీ స్థలంతో పాటు కొన్ని భవంతులను కూడా నిర్మించింది. మొత్తం 95 సెంట్ల మేర ఆక్రమించి సాగించిన ఈ నిర్మాణాలు కూడా పూర్తి చేసింది. ఇక్కడ స్థలం విలువ రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల మేర ఉంటుందని తెలుస్తోంది. ఇంత విలువైన స్థలాన్ని దర్జాగా తమ చేతుల్లోకి తీసుకుని స్వాధీనంలోకి తీసుకోవడం గమనార్హం. అంతేకాకుండా గేటెడ్ కమ్యూనిటీ తరహాలో గెడ్డ స్థలం కూడా తమ ఆధీనంలోనే ఉంచుకుని నిర్మాణం సాగించడం శోచనీయం. స్టీల్ హ్యాండ్లింగ్, లాజిస్టిక్స్‌తో పాటు రియల్ ఎస్టేట్‌రంగంలో వైజాగ్ ప్రొఫైల్స్ కంపెనీ వ్యవహారాలను నిర్వహిస్తోంది. రియల్ ఎస్టేట్ రంగంలో చెరువులను, గెడ్డలను ఆక్రమించి దర్జాగా విల్లాలు, అపార్టుమెంట్లను నిర్మించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీగా నిర్మించిన ఈ గ్రీన్‌సిటీలో గ్రీన్ సిటీ ఫంక్షన్ హాల్, అపార్టుమెంట్లను నిర్మించింది. అంతేకాకుండా క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, జిమ్, మినీథియేటర్, ఫంక్షన్ హాల్ వగైరాలను కూడా నిర్మించింది.

**ఆక్రమణలు ఇలా..**

గాజువాక మండల పరిధిలోని తుంగ్లాం రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబరు 6, 8లో గెడ్డలు ఉన్నాయి. సర్వే నంబరు 6లో 3.08 ఎకరాల్లో గెడ్డ విస్తరించి ఉంది. ఇక సర్వే నంబరు 8లో 2.02 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ గెడ్డలను వైజాగ్ ప్రొఫైల్స్ సంస్థ ఆక్రమించింది. సర్వే నంబరు 6లో 80 సెంట్ల స్థలాన్ని సదరు సంస్థ ఆక్రమించింది. ఇక సర్వే నంబరు 8లో ఒక చోట 10 సెంట్లు, మరో చోట 5 సెంట్ల మేర స్థలాన్ని ఆక్రమించింది. ఈ గెడ్డలను ఆక్రమించడంతో గెడ్డల ద్వారా నీరు పారకుండా అడ్డుకట్ట పడుతోందని స్థానికులు వాపోతున్నారు. తద్వారా కుంటలు ఎండిపోవడం... తద్వారా భూగర్భనీటి మట్టం కూడా తగ్గుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అంతేకాకుండా వర్షాలు పడిన సమయంలో వర్షపు నీరు సాఫీగా వెళ్లకుండా ఈ అక్రమ నిర్మాణాలు అడ్డుపడి పొంగి పొర్లేందుకు కారణమవుతున్నాయన్న ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మేయర్ హరివెంకట కుమారి తదితరులు

- డ్వాక్రా మహిళల రుణమాఫీ హామీ నెరవేర్చిన సీఎం జగన్
- 45 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు 'చేయూత'
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



హాజరైన స్వయం సహాయక సంఘ సభ్యులు

డాబాగార్డెన్స్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. జీవీఎంసీ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో స్వయం సహాయక సంఘ సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం, స్వయం సహాయక సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్ స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. పాదయాత్రలో మహిళల కష్టాలు స్వయంగా చూసి ప్రతి మహిళను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో డ్వాక్రా రుణాల మాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే రుణమాఫీ హామీ నెరవేర్చారని కొనియాడారు. నవరత్నాలను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి, శతశాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలని సంకల్పిస్తే... ఆయన తనయుడు వ్యాపారవేత్తలను చేస్తున్నారని పేర్కొన్నారు. 45 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు చేయూత ద్వారా ఐదేళ్లలో రూ.75 వేలు ఇచ్చి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. వారు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు మెప్మా ఆధ్వర్యంలో జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ – మార్కెట్ ప్రవేశపెట్టి దేశంలో ఎక్కడైనా మనం తయారు చేసే వస్తువులు విక్రయించుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఎంత చేసినప్పటికీ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని, వాటిని ఎప్పటికీ ప్రజలు విశ్వసించరని, మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ పేదరికం అనే చీకటిని తొలగించి, ప్రతి మహిళను ఆర్థికంగా పైకి తీసుకురావడమే జగనన్న లక్ష్యమని, ఇప్పటికి మూడు దఫాలుగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసి, ఆ గ్రూపులను బలోపేతం చేశారన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ చేతివృత్తుల వారి ఉత్పత్తులను అర్బన్ మహిళా మార్ట్ ద్వారా విక్రయించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, మహిళలను పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుంచే విధంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. ప్రతిపక్షాలు సచివాలయ వ్యవస్థపై చేస్తున్న విమర్శలు సరికాదన్నారు. అనంతరం తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్ పాపునాయుడు, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు తదితరులు మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల ఆర్థిక లబ్ధిపై మాట్లాడారు. కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు, పలు సంఘాల చైర్మన్లు, ఏపీడీలు, సీవోలు, ఆర్పీలు, స్వయం సహాయక బృందాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



జగనన్న మహిళా మార్ట్ స్టాల్ ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

## సేవ చేసే వారిని ప్రోత్సహించాలి

### మంత్రి మేరుగు నాగార్జున



మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

సబ్బవరం: పాశ్చాత్య దేశాల నుంచి స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకు వస్తున్న వారిని కేంద్ర ప్రభుత్వం ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ ద్వారా ప్రోత్సహించడానికి బదులు అడ్డుకోవడం తగదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. వెదుళ్లనరవలోని వెల్ఫేర్ సొసైటీ అఫ్ ఫెయిత్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలో ఉద్యోగాలను త్యాగం చేసి అనాథ పిల్లలకు సేవ చేసేందుకు వెల్ఫేర్ సొసైటీ అఫ్ చిల్డ్రన్ అఫ్ ఫెయిత్ డైరెక్టర్ తండు ఆనంద్ కుమార్, రోజీలు విద్యా సంస్థలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇటువంటి సేవలు అందిస్తున్న సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామని హామీ ఇచ్చారు. బావితరాలకు బంగారు భవిష్యత్ అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. విద్య, వైద్యంతోపాటు అనేక రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రిని సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దామా సుబ్బారావు, వార్డు ఇన్‌చార్జి మహాలక్ష్మి నాయుడు, దళిత క్రైస్తవ సంస్థల నిర్వాహకులు యలమంచిలి ప్రవీణ్ కుమార్, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, నాయకులు బొట్టా ముత్యాలు, పి.పెంటారావు, బీపీ స్వామి, మాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఒడిశాకు దాసుడు



సింహగిరి నుంచి తిరుగుపయనమవుతున్న దాసుడు

సింహాచలం : సింహగిరిపై మూడు నెలలు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సేవలో తరించిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ శుక్రవారం తమ స్వగ్రామం ఒడిశా రాష్ట్రంలోని బరంపురం సమీపంలోని పట్టుపురానికి తిరుగు పయనమయ్యారు. సింహగిరిపై ఉన్న దాసుడి సత్రం నుంచి మధ్యాహ్నం తమ పరివారంతో స్వామికి పూజలు చేశారు. తమ స్వగ్రామంలో ఏర్పాటు చేసిన స్వామివారి ఆలయంలోని హుండీల ద్వారా వచ్చిన నగదుని సింహగిరిపై ఉన్న హుండీల్లో వేశారు. పూజలనంతరం ఆలయం నుంచి బయలుదేరి కొండదిగువ దేవస్థానం పరిపాలనా కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి తిరుగుపయన మయ్యారు. ఆయనకు ఆలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

## నిషేధిత ప్లాస్టిక్ విక్రయదారులకు జరిమానా

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు శుక్రవారం అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు నేతృత్వంలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీ నిర్వహించి అపరాధ రుసుం వసూలు చేశారు. గాజువాక, పూర్ణామార్కెట్‌లో 45 హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి 1,420 కేజీల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు రూ.2,66,500 అపరాధ రుసుం వసూలు చేశామని అదనపు కమిషనర్ తెలిపారు.

## స్వచ్ఛ భారత్‌లో విశాఖ పాత్ర ప్రశంసనీయం



మాట్లాడుతున్న మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు

మద్దిలపాలెం : స్వచ్ఛభారత్‌లో విశాఖ యువత ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్‌లో ప్రస్తావించడం గర్వకారణంగా ఉందని మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఈస్ట్‌పాయింట్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ దుగ్గిరాల రాజకిషోర్ రచించిన ప్లాస్టిక్ గుప్పిట్లో భూగోళం గ్రంథాన్ని కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ఆవిష్కరించారు. విశాఖ తీరంలో సముద్ర గర్భంలో పేరుకుపోయిన ప్లాస్టిక్‌ను ఇటీవల యువత ఎంతో సాహసోపేతంగా వెలికితీయడం గొప్ప విషయమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విశాఖలో నిషేధించడం అభినందనీయమన్నారు. ప్లాస్టిక్ గుప్పిట్లో భూగోళం గ్రంథాన్ని ప్రొఫెసర్ దుగ్గిరాల రాజకిషోర్ అద్భుతంగా విశ్లేషణతో రచించారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి బాలమోహన్‌దాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో పలువు ప్రొఫెసర్లతోపాటు, ఈస్ట్ పాయింట్ కాలనీ మిత్ర బృందం బంగారురాజు, కల్పన, కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారానికి ప్రోత్సాహం

ఆనందపురం: ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఏడీ ఎం.రహీం చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ ఈ పథకం కింద బియ్యం, మామిడి, జీడిపప్పు, పసుపు, మిరప, చిరుధాన్యాలు, పాలు, చేపలు, సముద్ర ఉత్పత్తులు వంటి వాటి ద్వారా వ్యాపారాలు చేయాలనుకునే వారు అర్హతను బట్టి ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం రాయితీ, 90 శాతం బ్యాంక్ రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో గానీ, జిల్లా అధికారులకు నేరుగా గానీ దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ, ఉద్యానవన శాఖ అధికారి సోని, పశు వైద్యాధికారిణి లీలారాణి, డీఆర్‌డీఏ ఏసీ నాయుడు, డీపీవో వైదేహి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారి రమేష్, డీఆర్పీ ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

## పవన్‌వి అవగాహన లేని వ్యాఖ్యలు

### వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

డాబాగార్డెన్స్/గోపాలపట్నం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన..ప్రభుత్వ పథకాలపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు కనీసం అవగాహన లేదని అందుకే ఆయన అలా మాట్లాడుతున్నాడని వైఎస్సార్‌సీపీ రీజినల్ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి అన్నారు.గురజాడ కళాక్షేత్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలోనే గొప్ప సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రం ఒక్క ఏపీయేనన్నారు. సాక్షాత్తు నీతి ఆయోగ్ సమావేశంలో ఎందరో ఇదే విషయాన్ని కొనియాడరని చెప్పారు. గత ప్రభుత్వంలో ప్రజల కోసం రూపాయి అందిస్తే..జన్మభూమి కమిటీలు అర్ధరూపాయి దోచుకునేవారన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అవినీతి లేకుండా పథకాలు సంపూర్ణంగా ఉండుతున్నాయన్నారు. ఇలాంటి అవినీతి లేని పాలన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు ఇష్టం లేనట్టుంది..అందుకే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఈనాడు రామోజీరావు ఏంరాసుకున్నా..గత ప్రభుత్వం..ప్రస్తుత ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు తెలుసునన్నారు. అంతకుముందు ఎయిర్ పోర్టులో వైవీ సుబ్బారెడ్డికి ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, పెట్ల ఉమాశంకర్ గణేష్, నియోజకవర్గ సమన్వయకర్తలు ఆడారి ఆనంద్ కుమార్, కేకే రాజు, పార్టీ నేతలు సీతంరాజు సుధాకర్, చింతలపూడి వెంకటరామయ్య, రెహమాన్, పేడాడ రమణ కుమారి, వంకాయల మారుతీ ప్రసాద్, పీలా ఉమారాణి, బెహరా భాస్కరరావు ఘనంగా స్వాగతం పలికారు.

## 'ఆడుదాం ఆంధ్ర' కార్యాచరణపై సీఎస్ సమీక్ష

మహారాణిపేట: గర్భిణుల్లో రక్తహీనతను నివారించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఆడుదాం ఆంధ్ర, వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పాఠశాల విద్య, జగనన్నకు చెబుదాం వంటి అంశాల పురోగతిపై జిల్లాల వారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో నాడు–నేడు కింద నిర్వహిస్తున్న పనుల పురోగతిని జేసీ కె.ఎస్.విశ్వనాథన్.. సీఎస్‌కు వివరించారు. డీఈవో చంద్రకళ, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

# అదుర్స్.. మిల్లెట్ టిఫిన్స్



**ఒకప్పుడు పేదల ఆకలి తీర్చిన 'చిరు ధాన్యాలు' ఇప్పుడు అందరి మెనూలో చేరాయి. 'ఫాస్ట్‌ఫుడ్' యుగంలో ఈ చిరుధాన్యాలేంటి అనుకుంటున్నారా? 'సూపర్ ఫుడ్.. వండర్ గ్రెయిన్స్' మిల్లెట్ ప్రస్తావన వచ్చినప్పుడు నిపుణులు చెప్పే మాట ఇది. 30 ఏళ్లకే ఉప్పెనలా వచ్చిపడుతున్న బీపీ, సుగర్ వంటి వివిధ రకాల వ్యాధులు నగర వాసుల ఆహారపు అలవాట్లను సమూలంగా మార్చేశాయి. రోగాలు వచ్చినప్పుడు మాత్రలు మింగే బదులు.. అవి రాకుండా చూసుకోవడమే ఉత్తమమని గుర్తించారు. అందుకే 'చిరుధాన్యాలతో ఆరోగ్య సిరి' అంటున్నారు నగర ప్రజలు. ప్రజల అభిరుచికి అనుగుణంగా మహా నగరంలో మిల్లెట్ హోటళ్లు, రెస్టారెంట్లు వెలుస్తున్నాయి. ఇక్కడ 'ఆహా' అనేలా సిరి ధాన్యాల వంటకాలు నోరూరిస్తున్నాయి.** – విశాఖపట్నం డెస్క్

- చిరుధాన్యాలకు పెరుగుతున్న డిమాండ్
- వెలుస్తున్న మిల్లెట్ టిఫిన్ సెంటర్లు, హోటళ్లు
- నగర ప్రజల అభి'రుచి'కి అనుగుణంగా వంటకాలు

ప్రస్తుతం అన్ని వయసుల వారిలోనూ ఆరోగ్య స్పృహ పెరుగుతోంది. జీవనశైలి వ్యాధులకు దూరంగా, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా బతికిన నిన్నటి తరం ఆహారపు అలవాట్లను నేటి తరం ఎంతో ఆసక్తిగా పరిశీలిస్తోంది. అందుకు తగినట్లుగానే తీసుకునే ఆహారంలోనూ మార్పులు వస్తున్నాయి. నగర జీవనంలో పెరుగుతున్న ఒత్తిళ్లు, రకరకాల అనారోగ్య సమస్యల నుంచి శాశ్వత విముక్తి, ఊరట పొందేందుకు పోషక విలువలు, పీచు పదార్థాలు సమృద్ధిగా ఉండే సజ్జలు, కొర్రలు, ఊదలు, సామలు, జొన్నలు, రాగులు, వంటి చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. అందుకే పేద, ధనిక తేడా లేకుండా అందరి మెనూలోనూ ఇప్పుడు మిల్లెట్స్ భాగమయ్యాయి. దీంతో అనూహ్యంగా వీటికి డిమాండ్ పెరిగింది. మిల్లెట్స్‌పై మరింత అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది.

### ఏమిటీ చిరుధాన్యాల గొప్ప?

ఇప్పుడు అన్నం తింటున్నాం.. అంతా బాగానే ఉంది కదా? ప్రత్యేకంగా చిరుధాన్యాలను ఎందుకు తినాలి? పైగా కొన్ని రకాల మిల్లెట్స్‌తో పోలిస్తే.. గోధుమలు, రైస్ చాలా రుచిగా ఉంటాయి కదా అనే వాళ్లు చాలా మంది ఉంటారు. అన్నంతో పోలిస్తే చిరుధాన్యాల్లో ప్రొటీన్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్, విటమిన్లు చాలా ఎక్కువగా ఉంటాయి. పైగా గ్లూటిన్ ఉండదు. చాలా రకాల మిల్లెట్స్‌లో 10 శాతం ప్రొటీన్, 3.5 శాతం లిపిడ్స్ ఉంటాయి. రాగుల్లో అయితే ఏకంగా 12–16 శాతం ప్రొటీన్ ఉంటుంది. 2–5 శాతం లిపిడ్స్ ఉంటాయి. తక్కువ కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. జొన్నల్లో డైటరీ ఫైబర్, విటమిన్లు, క్యాల్షియం, జింక్, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, పాస్ఫరస్, కాపర్, మాంగనీస్ లాంటివన్నీ ఉంటాయి. వీటివల్ల ఊబకాయం, షుగర్, గుండెపోటు లాంటి సమస్యల నుంచి బయటపడొచ్చని వైద్యులు చెబుతున్నారు.

### మిల్లెట్స్ వంటలకు ఫుల్ డిమాండ్

నగరంలో చిరుధాన్యాల వంటకాలకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. బీచ్‌రోడ్డు, ద్వారకానగర్, సిరిపురం, పాత డెయిరీ ఫారం, మధురవాడ, గాజువాక, ఎండాడ, మురళీనగర్, టౌన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా మిల్లెట్ ఆధారిత హోటళ్లు, రెస్టారెంట్లు వెలిశాయి. కొర్రలు, అరికెలు, ఊదలు, సామలు వంటి చిరు ధాన్యాలతో పాటు పెసర్లు, శనగల మొలకలతో చేసే టిఫిన్లు దొరుకుతున్నాయి. మిల్లెట్లతో తయారు చేసే కిచిడీ, పూరీ, ఫ్రైడ్ రైస్, బిర్యానీ, బ్రెడ్, పొంగల్, చద్దన్నం, ఇడ్లీ, చాట్, వెజ్ మిల్లెట్ బాత్, రోటీ, పాన్‌కేక్, పిజ్జా, బర్గర్, పాయసం, దోశలు.. ఇలా ఒకటేమిటి ఎన్నో రుచులు బాగా ఫేమస్ అయ్యాయి. ఎండాడలోని ఓ హోటల్‌లో రాగి పాత్రల్లో మిల్లెట్స్ వంటకాలు వండి.. వినియోగదారులకు అందిస్తున్నారు. ఇక్కడ లభించే మిల్లెట్ పాకం గారెలు, రాగి దోశ కోసం వినియోగదారులు సుదూర ప్రాంతాల నుంచి వస్తారంటే అతిశయోక్తి కాదు. హెల్త్ కోసమే కాకుండా వీటిని రుచి కోసం తినేవాళ్లు కూడా చాలా మందే ఉన్నారు. ప్రభుత్వ సర్క్యూట్ హౌస్ ఎదురుగా ఏర్పాటు చేసిన వాసెన్‌పోలి సెంటర్‌లో మిల్లెట్స్‌తో తయారుచేసిన రుచికరమైన ఇడ్లీ, దోశలు దొరుకుతున్నాయి. వీటి కోసం ఉదయం వినియోగదారులు క్యూ కడుతున్నారు. ఇక మిల్లెట్ ఉత్పత్తులను విక్రయించే షాపులు కోకొల్లలు. సూపర్ మార్కెట్‌లో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి వీటిని విక్రయిస్తున్నారు.





### పాకం గారెలు సూపర్

మేము కొద్ది నెలల వరకూ సాధారణ దోశలు, పూరి వంటి అల్పాహారం తీసుకునేవాళ్లం. మిల్లెట్స్ వినియోగంతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిసినవాళ్లు చెప్పడంతో అటు వైపు మళ్లాం. ఇప్పుడు రోజూ చిరుధాన్యాలతో చేసిన అల్పాహారం తీసుకుంటున్నాం. రోజంతా ఉత్సాహంగా ఉంటున్నాం. మూడు నెలలుగా ప్రతి రోజూ ఇదే పద్ధతి పాటిస్తున్నాం. సోమాలో పాకం గారెలు ఒక్కసారి తింటే మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది.

– పి.వరుణ్, రేష్మి, సాగర్‌నగర్

### రూ.10 కోట్లకు పైగా టర్నోవర్

విశాఖలో ఏడాదికి మిల్లెట్స్ టర్నోవర్ రూ.10 కోట్లకు పైనే ఉంటోంది. నగరంలో ఈ తరహా ఉత్పత్తులు విక్రయించే స్టోర్స్ 28 వరకు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో కొంత మంది స్టోర్ ట్రేడర్లు రైతుల వద్ద నుంచి నేరుగా మిల్లెట్ ఉత్పత్తులు కొనుగోలు చేస్తుండగా.. ఎక్కువ శాతం పూర్ణమార్కెట్‌లోని సప్లయర్స్ నుంచి కొనుగోళ్లు చేస్తున్నారు. నంద్యాల ప్రాంతం నుంచి కొర్రలు ఎక్కువగా నగరానికి వస్తుండగా.. కర్ణాటకలోని రాయచూర్ నుంచి అండు కొర్రలు, ఒడిశా నుంచి సామలు దిగుమతి అవుతున్నాయి. మన మన్యంలో సైతం రైతులు మిల్లెట్లను పండిస్తున్నారు.

### అందరికీ ఆరోగ్యం లక్ష్యం



మా దగ్గర ఉదయం, సాయంత్రం మూడు రకాల్లో ఇడ్లీ లభిస్తుంది. మిల్లెట్స్ చద్దనాన్ని ఇష్టపడి తింటారు. చిరుధాన్యాల్లో ఎనిమిది రకాల లేయర్లు ఉంటాయి. అందుకే చద్దన్నం కోసం మిల్లెట్స్‌ను 8 గంటల పాటు నానబెడతాం. తర్వాత 2 గంటల పాటు ఉడకబెట్టి.. తర్వాత 8 గంటల పాటు మజ్జిగలో పులియబెడతాం. ఉల్లి, పచ్చిమిర్చి, క్యారెట్ తురుము వేసి వినియోగదారులకు అందిస్తాం. బఠానీతో చాట్, పాయసం బాగా ఫేమస్. ఎవరైనా మిల్లెట్ వంటకాల తయారీ నేర్చుకోవాలంటే అవగాహన కల్పిస్తాం. వ్యాపార కోణంలో కాకుండా అందరికీ ఆరోగ్యం పంచడమే మా లక్ష్యం.

– శేఖర్, జగదమ్మ నేచురల్స్, పాత డెయిరీ ఫారం, ఆరిలోవ

### మాజీ ఉప రాష్ట్రపతి సందర్శించారు



భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు 2021లో స్టాల్‌ను సందర్శించి ట్వీట్ చేయడంతో ప్రజాదరణ పెరిగింది. ప్రభుత్వ సర్క్యూట్ హౌస్ ఎదురుగా ఉన్న మా సెంటర్‌లో దొరికే మిల్లెట్ ఇడ్లీ, దోశకు మంచి డిమాండ్ ఉంది. నగరం నలుమూలల నుంచి ప్రజలు ఇక్కడ మిల్లెట్స్‌తో తయారుచేసిన టిఫిన్ కోసం వస్తుంటారు. మూడేళ్ల క్రితం రోజుకు రూ.10 వేల వరకు విక్రయాలు జరగ్గా.. ఇప్పుడు రూ.25 వేలు వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. రాగి, జొన్న, సామలతో తయారు చేసిన ఇడ్లీ, మిల్లెట్ దోశతోపాటు కొర్ర పాయసం బాగా ఫేమస్. పెదబయలు, ముంచంగిపుట్టు, పాడేరు, చింతపల్లి, అరకు ప్రాంతాల నుంచి మిల్లెట్స్ తీసుకొస్తాం.

– సుధీర్, వాసెన్‌పోలి మిల్లెట్ సెంటర్ నిర్వాహకుడు

### ఆరోగ్యానికి మేలు చేస్తాయి



ఎండాడలోని సోమా హోటల్‌లో విభిన్న రుచుల్లో పదార్థాలు అందిస్తున్నారు. తినడానికి చాలా బాగున్నాయి. ఇక్కడ రాగి ఇడ్లీ, పాకం గారెలు తింటాం. మిల్లెట్స్‌తో తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. బీపీ, షుగర్‌తో పాటు అనారోగ్య సమస్యలు ఉన్న వారే వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. అలా కాకుండా అందరూ మిల్లెట్స్‌ను వినియోగించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు. నేచురల్స్ స్టోర్‌ల్లో రాగులు, కొర్రలు, సామలు వంటి రా మెటీరియల్‌తో పాటు పిండ్లు కూడా లభిస్తున్నాయి. వాటితో ఇంట్లోనే నచ్చిన పదార్థాలు కూడా తయారు చేసుకోవచ్చు.

– డాక్టర్ ఎం.ప్రసన్న లక్ష్మి



## 100 గజాల వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్

**కన్వేయన్స్ డీడ్‌లను అందజేసిన జేసీ విశ్వనాథన్**



రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న మధురవాడ సబ్ రిజిస్ట్రార్ మోహన్‌రావు

**అక్కిరెడ్డిపాలెం:** జీవో నంబర్ 301, 388 ద్వారా క్రమబద్ధీకరణ పట్టాలు పొందిన లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్‌లను జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అందజేశారు. షీలానగర్‌లోని గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం 23 మంది లబ్ధిదారులకు జాయింట్ కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ సృజన, సబ్ రిజిస్ట్రార్ కె.రాజు, తహసీల్దార్ పాల్ కిరణ్ వీటిని అందించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గాజువాక పరిధిలో 7,200 దరఖాస్తులు అందాయన్నారు. 100 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న వారు ఎటువంటి రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. 100 చదరపు గజాల పైన ఉంటే క్రమబద్ధీకరణ ఖర్చుపై 7.5శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాలన్నారు. ఈ ప్రక్రియ ఈ ఏడాది చివరి వరకు కొనసాగుతుందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయా సబ్ రిజిస్ట్రేషన్ల పరిధిలో కన్వేయన్స్ డీడ్‌లను లబ్ధిదారులకు అందజేసినట్లు వెల్లడించారు. టైటిల్ డీడ్ పట్టాలు పూర్తి అనుభవంతో రిజిస్ట్రేషన్ హక్కులు కలిగి ఉంటాయని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని సూచించారు. గాజువాక ఆర్ఐ విజయ, వీఆర్వో పాల్గొన్నారు.

**పెదగంట్యాడలో..**

**పెదగంట్యాడ:** పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు జేసీ విశ్వనాథన్ కన్వేయన్స్ డీడ్‌లు అందించారు. వారంలో రెండు రోజుల పాటు ఈ రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశించారు. జిల్లా రిజిస్ట్రార్ సృజన, తహసీల్దార్ రమాదేవి, సబ్ రిజిస్ట్రార్ తవిటినాయుడు పాల్గొన్నారు.

**క్రమబద్ధీకరణ పట్టాల రిజిస్ట్రేషన్ ప్రారంభం**

**మధురవాడ:** ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జీవో 301, 388 ప్రకారం క్రమబద్ధీకరణ పట్టాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ (కన్వేయన్స్ డీడ్) శనివారం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రారంభమైంది. ఈ సందర్భంగా 32 మందికి రిజిస్ట్రేషన్లు చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ ఎస్.మోహన్‌రావు తెలిపారు. తహసీల్దార్ రమణయ్య, ఆర్ఐ మల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐఏ విశాఖ చైర్మన్‌గా రాజేష్ నాగుల



రాజేష్ నాగుల

**సీతమ్మధార:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్(ఐఐఏ) విశాఖపట్నం చైర్మన్‌గా రాజేష్ నాగుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆన్‌లైన్‌లో ఈ ఎన్నికలు జరిగాయి. కార్యదర్శిగా రాంజీ అంబేడ్కర్, ఉపాధ్యక్షుడిగా మృదుల, కోశాధికారిగా బండారు సందీప్ కుమార్, ఈసీ సభ్యులుగా బండారు లలిత, రమేష్‌బాబు, జోషిరాజు, ప్రదీప్త, సురేంద్రనాథ్‌లు ఎన్నికయ్యారు.

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



సత్యలక్ష్మికి నియామకపత్రం అందిస్తున్న వెంకటేశ్వరరావు

**సీతమ్మధార:** చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశీలమెట్టలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో భాగంగా అసోసియేషన్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా కంటుభుక్తా సత్యలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆమెకు జాతీయ అధ్యక్షుడు నియామకపత్రం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించనప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. బీసీల కులగణన చేపట్టడానికి 8 రాష్ట్రాల అసెంబ్లీలలో తీర్మానం జరిగిందని, 16 రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. రాష్ట్రంలో ప్రత్యేకంగా కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సత్యలక్ష్మి మాట్లాడుతూ బీసీ మహిళలందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి.. హక్కుల సాధనకు తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కుప్పిలి రవికుమార్, కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కాకర్ల రాజారావు, ఆర్.కృష్ణవేణి, సీహెచ్ నాగేశ్వరరావు, ఊర్వశి, మహాలక్ష్మి, వెంకటలక్ష్మి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## 47 మందికి ఉద్యోగాలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎన్టీపీసీ అధికారులు

**అగనంపూడి:** లంకెలపాలెం సమీపంలోని హైటెక్ ఐటీఐ ఆవరణలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (విజయవాడ), ఎన్టీపీసీ సంయుక్తంగా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. హైటెక్ ఐటీఐ నుంచి 250 మంది విద్యార్థులకు హాజరు కాగా 47 మందిని ఎంపిక చేసినట్టు నోబుల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(నిస్ట్) చైర్మన్ బి.ఆనందరావు, హైటెక్ ఐటీఐ ప్రిన్సిపాల్ అక్కిరెడ్డి దుర్గునాయుడు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 27వ తేదీ నుంచి ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో రూ.3వేల స్టైఫండ్‌తోపాటు ఉచితంగా భోజనాలు అందిస్తామన్నారు.. తర్వాత ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రూపవతి, శ్రీను, భనావతి అంజి నాయక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- 48, 49 వార్డుల్లో రూ.6.80 కోట్లతో పనులకు మేయర్ శంకుస్థాపన

**కంచరపాలెం:** జీవీఎంసీ 48, 49 వార్డుల్లోని కొండవాలు ప్రాంతాల్లో రూ.6.80 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం ఊర్వశి కూడలి జాతీయ రహదారిలో ముఖ్య అతిథి మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేసి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలన్నారు.

**అభివృద్ధి పనుల వివరాలివీ..** ఈ వార్డుల్లోని బర్మాక్యాంప్ ప్రధాన రహదారిలో బీటీ రోడ్డు, శివలింగపురం, పల్నాటి కాలనీల్లో కొండవాలుకు రిటైనింగ్ వాల్, న్యూశ్రీనివాసనగర్‌లో డ్రైనేజీలు, గెడ్డలు, బాపూజీనగర్, రామకృష్ణాపురం, నీలకంఠనగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో సీసీ, రోడ్లు, డ్రైనేజీలు, మెట్ల మార్గాలు, ఇందిరానగర్–5లో కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ భవన పునఃనిర్మాణం, బర్మాక్యాంప్‌లో శ్మశానవాటిక ఆధునికీరణ పనులను సుమారు రూ.6.80 కోట్ల నిధులతో ప్రారంభించినట్లు జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, బీజేపీ 48వ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, జోన్ ఇంజినీరింగ్ అధికారులు ఈఈ శ్రీనివాస్‌రావు, డీఈ భరణికుమార్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

## 21న ఉద్యోగుల గ్రీవెన్స్ డే

**మహారాణిపేట:** ఉద్యోగుల నుంచి వ్యక్తిగత ఫిర్యాదులు స్వీకరించేందుకు ఈ నెల 21న ఉదయం 11 గంటలకు ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల నుంచి అందించిన ఫిర్యాదులను జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో ప్రత్యేక ఐడీలతో నమోదు చేస్తామన్నారు. దీని వల్ల ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేసే సదుపాయం ఉందని వెల్లడించారు.